GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 23-08-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# డీఏపీ ధరలకు రెక్కలు..!!

## మహాదేవపూర్‌లో రైతులపై ఎరువుల భారం..







- రూ.1,350 బస్తాకు రూ.1,700–1,900 వసూలు
- అధికారుల పర్యవేక్షణ కరువైందా?
- అధిక ధరలకు అడ్డుకట్ట వేయాలని రైతుల డిమాండ్

**మహాదేవపూర్, ఆగస్టు 22 (ప్రతినిధి):** ప్రభుత్వం డీఏపీ 50 కిలోల బస్తా ధరను రూ.1,350గా నిర్ణయించినా.. మహాదేవపూర్ మండలంలో రైతులకు మాత్రం అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఒక్కో బస్తాకు రూ.1,700 నుంచి రూ.1,900 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అత్యవసరమైన డీఏపీ ఎరువులపై ఇలా అధిక ధరలు వసూలు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

2లో

**ఎంఆర్‌పీ VS వసూలు చేస్తున్న ధర**

| ప్రభుత్వ నిర్ణయించిన ఎంఆర్‌పీ ధర | | మహాదేవపూర్‌లో వసూలు చేస్తున్న ధర |
|---|---|---|
| ₹1,350 (50 కిలోల బస్తా) | Vs | ₹1,700 నుంచి ₹1,900 వరకు (50 కిలోల బస్తా) |

ఓ బస్తాపై అదనపు భారం రూ.350 నుంచి రూ.550

రైతులపై అదనపు భారం

**రైతుల ఆవేదన**



- ఎరువు లేక పంటలు దెబ్బతింటాయి
- అధిక ధరలతో సాగు ఖర్చులు పెరుగుతున్నాయి
- సరైన తనిఖీలు చేయడం లేదు

**రైతుల మాట**

"ప్రభుత్వం ధర ఒకటే చెబుతుంది. కానీ షాపుల వాళ్లు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికారులు వచ్చి తనిఖీ చేసి, అధిక ధరలకు అడ్డుకట్ట వేయాలి.
– మహాదేవపూర్ రైతులు



# చిన్న ప్లాట్.. 7, 8 అంతస్తుల భవనాలు..!

- అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు..!
- నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదుదారు ఆవేదన
- ప్లాట్ నంబర్లతో సహా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు.



6లో

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

- అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా చర్యలు
- ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో మీడియాదే కీలక పాత్ర
- 1,15,851 మంది ఓటర్లకు నోటీసులు జారీ..
- క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న బీఎల్‌వోల ప్రక్రియ
- మీడియా సమావేశంలో జిల్లాలోని వివరాలను వెల్లడించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

7లో



# డీఏపీ ధరలకు రెక్కలు..!!

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** వానాకాలం సాగు పనులు జోరందుకున్న వేళ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పలుగ్రామాల్లో ఎరువుల ధరలు రైతులకు భారంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా డీఏపీ ఎరువుల బస్తాను ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా విక్రయిస్తున్నారంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.1,350 బస్తా.. రూ.1,700 నుంచి రూ.1,900 వరకు? 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350గా ఉండగా, మండలంలోని కొన్ని ఎరువుల దుకాణాల్లో అదే బస్తాను రూ.1,700 నుంచి రూ.1,900 వరకు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి సమాచారం అందుతోంది. అంటే ఒక్కో బస్తాపై సుమారు రూ.350 నుంచి రూ.550 వరకు అదనపు భారం రైతులపై పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎకరాకు పలు బస్తాల ఎరువులు వినియోగించాల్సిన రైతులకు సాగు ఖర్చులు మరింత పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

**రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నారా?**

విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, దున్నకాలు, ఇతర వ్యవసాయ పెట్టుబడులు ఇప్పటికే పెరిగిన నేపథ్యంలో ఎరువులపై అదనపు ధర వసూలు చేస్తే రైతుపై మరింత ఆర్థిక భారం పడుతుందని రైతులు అంటున్నారు. పంటకు కీలకమైన సమయంలో డీఏపీ తప్పనిసరి కావడంతో ధర ఎంతైనా చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు ఎక్కడ?**

మండలంలో ఎరువుల విక్రయాలపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, అధిక ధరల వసూళ్లపై తనిఖీలు జరుగుతున్నాయా? లేదా? అన్న ప్రశ్నలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ఎరువుల దుకాణాల్లో నిల్వలు, అమ్మకాల రిజిస్టర్లు, బిల్లులు, ఎంఆర్‌పీ ధరల ప్రదర్శన, రైతులకు జారీ చేస్తున్న రసీదులు తదితర అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

**ఒక్క బస్తాపై రూ.500 భారం.. రైతు ఎలా సాగు చేయాలి?**

"పంటకు ఎరువు వేయకుండా సాగు చేయలేం. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే వందల రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తే పెట్టుబడి ఖర్చు పెరిగిపోతుంది. పంటకు సరైన ధర వస్తుందో




లేదో తెలియని పరిస్థితిలో ఎరువుల కోసం అదనపు డబ్బులు చెల్లించడం కష్టంగా ఉంది" అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బస్తాపై రూ.500 వరకు అదనపు భారం పడితే, పంటకు అవసరమైన నాలుగైదు బస్తాలపై రైతు ఎంత అదనంగా చెల్లించాల్సి వస్తుందో అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించాలి..మహాదేవపూర్ మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. డీఏపీని అధిక ధరకు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యాపారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచిన సబ్సిడీ ప్రయోజనం మధ్యలోనే వ్యాపారుల చేతుల్లోకి వెళ్లకుండా అధికారులు పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

**అధికారులు అంధకారంలోనే ఉంటారా?**

రైతుల నుంచి వస్తున్న అధిక ధరల ఆరోపణలపై మహాదేవపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. మండలంలోని ఎరువుల దుకాణాలపై తనిఖీలు నిర్వహించి డీఏపీ వాస్తవ విక్రయ ధరలు, నిల్వలు, బిల్లుల వివరాలను పరిశీలిస్తారా? అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాల్సి ఉంది. రైతులకు అందాల్సిన ఎరువు.. వ్యాపారుల అదనపు లాభాలకు మారకూడదని, ప్రభుత్వ ధరలకే ఎరువులు అందేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# జీవో 97ను రద్దు చేయాలి

పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ కుట్రకు నిరసనగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య, డిప్లొమా కోర్సులను కొత్తగా ఏర్పడిన శక్తి విభాగం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి విలీనం చేయాలని ఈ జీవో ప్రతిపాదిస్తోందని, తక్షణమే ఈ జీవోను నిలిపివేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75వేల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దని, వారి భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టడం సరికాదని పేర్కొన్నారు. సాంకేతిక విద్యను నిర్వీర్యం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నదని ధ్వజమెత్తారు. విద్యార్థుల ఆందోళనలకు బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంటుందని ప్రకటించారు. జీవో 97ను రద్దు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు





# తుపాకుల విక్రయ ముఠా గుట్టురట్టు

రెండు 9 ఎంఎం పిస్టళ్లు.. 19 బుల్లెట్లు స్వాధీనం

ఉత్తరప్రదేశ్‌లోని దయాల్‌పూర్ గ్రామానికి చెందిన పర్భున్స్ కుమార్(27) ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి చర్లపల్లిలో నివసిస్తున్నాడు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పర్భున్స్ కుమార్ వ్యసనాలకు అలవాటు పడి అడ్డదారులను ఎంచుకున్నాడు. ఈ క్రమంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడి జైలు పాలయ్యాడు.అనంతరం విడుదలైన తరువాత అక్రమ ఆయుధాల వ్యాపారం మొదలు పెట్టాడు. ఇందులో భాగంగా ఈ నెల 10న బీహార్‌కు వెళ్లిన పర్భున్స్ కుమార్ అకడ సోను అనే వ్యక్తిని సంప్రదించి అతడి వద్ద తకువ ధరకు తుపాకులు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందని సీపీ వివరించారు. హైదరాబాద్‌లో నేరాలకు పాల్పడే వారికి అధిక ధరకు విక్రయించాలని ప్రణాళిక వేసినట్లు సీపీతెలిపారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి జోన్ ఎస్‌ఓటీ, బొల్లారం పోలీసులు శనివారం ఉదయం బొల్లారం సాదనా మందిర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పర్భున్స్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా అతడి వద్ద రెండు 9 ఎంఎం పిస్టళ్లతో పాటు 19 బుల్లెట్లు, మూడు మ్యాగజైన్లు, ఒక డబుల్ బ్యారెల్ తపంచాతో పాటు బుల్లెట్లు, మొబైల్ ఫోన్ లభించాయి.

# నీటి గుంతల నిర్మాణంతోనే భూగర్భ జలాలు

కూసుమంచి, ఆగస్టు 22 : నీటి గుంతల నిర్మాణంతోనే భూగర్భ జలాలు పెరుగుతాయని, వీటి నిర్మాణం ఒక యజ్ఞంలా సాగాలని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. కూసుమంచిలోని పల్లపు ప్రాంతంలో వర్షపు నీటి నిల్వ కోసం రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు తీసిన ఫాం పాండ్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించి, రైతును అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ రైతు ఇలా ఆలోచించి ఆచరణలో పెడితే పక్కనే ఉన్న బోరు బావుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు వర్షపు నీటి నిల్వ కోసం తీసిన గుంతలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఫాం పాండ్స్ నిర్మాణాలపై రైతులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల జరిగే లాభాల గురించి తెలియజేస్తే రైతులు ముందుకొస్తారని, వీటి నిర్మాణంతో భూమి తగ్గుతుందని భావించడం ఒక అపోహ మాత్రమేనన్నారు. ఫాం పాండ్స్‌లో చేపలు, రొయ్యలు కూడా పెంచుకోవచ్చని, వ్యవసాయానికి అనుబంధంగా అదనపు ఆదాయం కూడా రైతులకు సమకూరుతుందన్నారు.



## జవహర్ నగర్ లో సిసి రోడ్డు పనులు ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ లో 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు నెలకొన్న తన దృష్టికి తీసుకురావాలని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, జాన్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కాశి రెడ్డి, శ్రీశైలం,మాధవి, పద్మావతి, మల్లేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## బీపీఎల్ కోటాలో పరిశీలిస్తాం..!

**టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కోటా లేదా మరోరకంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) శనివారం చేపట్టిన పాదయాత్రలో భాగంగా కూసుమంచి తహశీల్దారు కార్యాలయంలో తనను కలిసిన పాదయాత్ర బృందానికి కలెక్టర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని వివరించారు. ఏదో ఒక రకంగా ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సొసైటీల ద్వారా ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఏ రకంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వవచ్చో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే బీపీఎల్ కోటాలో ఇచ్చినా అభ్యంతరం లేదంటున్నారు కాబట్టి... ఆ అంశాన్ని కూడా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట కూసుమంచి తహశీల్దారు సైదులు కూడా ఉన్నారు. అంతకుముందు పాదయాత్ర బృందానికి ప్రైవేట్ ఉపాధ్యాయుల బృందం ఘనంగా స్వాగతం పలికింది. జర్నలిస్టుల పిల్లలు పూలమాలలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఇర్షాద్, అజీజ్, శేఖర్ రెడ్డి, ప్రసాద్, కిరణ్, పెండ్ర అంజయ్య, కొమ్ము ప్రభాకర్, పందిరి వెంకట్ రెడ్డి, గర్నె నాగేశ్వరరావు, కర్ణబాబు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



## మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కల హడావిడి.. రోగుల గదుల్లోకే కుక్కల ప్రవేశం

**భయాందోళనలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు.**

**రోగులను పట్టించుకునే నాథుడే కరువు.. ఎవరికి వారే యమునాతీరే**

**మర్రిగూడ క్రైమ్ మిర్రర్:** మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కల హడావిడి రోజురోజుకూ పెరుగుతుండటంతో రోగులు, వారి బంధువులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సాధారణంగా ఆసుపత్రి పరిసరాల్లోకి కుక్కలు రావడం కనిపించినా, ఇక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఏకంగా రోగులు వైద్యులను సంప్రదించే గదుల్లోకి సైతం, కుక్కలు నేరుగా ప్రవేశిస్తున్న పరిస్థితి నెలకొంది. దీనితో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే వారు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు కుక్కలను చూసి తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని రోగులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై ప్రజలను వెంబడించడం, కరవడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో.. అనారోగ్యంతో చికిత్స కోసం వచ్చే ప్రజలు ఉండే ప్రభుత్వ ఆసుపత్రిలోనే, కుక్కలు స్వేచ్ఛగా సంచరించడం మరింత ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఆసుపత్రి అనేది ప్రజలకు భద్రత, వైద్యం అందాల్సిన ప్రదేశం. అలాంటి చోట కుక్కలు రోగుల గదుల్లోకి ప్రవేశించే స్థాయికి పరిస్థితి చేరుకోవడం ఆసుపత్రి నిర్వహణ, పరిసరాల పర్యవేక్షణపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. కుక్కలు అకస్మాత్తుగా రోగులపైకి దూసుకెళ్లినా, చిన్నారులను వెంబడించినా, ఎవరినైనా కరిచినా పరిస్థితి ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు.

**ఆసుపత్రి నిర్వహణపై రోగుల ఆగ్రహం..**

ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తోంది. అయితే ఆసుపత్రి ప్రాంగణంలో, ఆసుపత్రి లోపల ఇలాంటి పరిస్థితులు నెలకొంటే పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం ఎలా కలుగుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆసుపత్రిలోకి కుక్కలు ప్రవేశించకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, గేట్లు, ప్రహరీ తదితర ప్రాంతాలను పర్యవేక్షించడం వంటి కనీస చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పబ్లిక్ అంటున్నారు. రోగులు వైద్యులను కలిసే గదుల్లోకి సైతం కుక్కలు వెళ్లే పరిస్థితి ఏర్పడటం చిన్న విషయం కాదని, దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కుక్కలను తరిమేయడం ఒక్కటే కాకుండా, అవి ఆసుపత్రి లోపలికి ఎందుకు వస్తున్నాయో గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి రోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని కోరుతున్నారు. ఘటన జరిగే వరకు వేచి చూడొద్దు.. ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ "ఎవరినైనా కుక్కలు కరిచిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందే అధికారులు మేల్కొనాలి" అని రోగులు, వారి బంధువులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు ఎక్కువగా వచ్చే ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని వారు స్పష్టం చేస్తున్నారు. కుక్కల సంచారంతో ఏదైనా ప్రమాదం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న ఈ సమస్యపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, స్థానిక అధికారులు వెంటనే స్పందించి కుక్కల బెడదను నివారించడంతో పాటు ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే రోగుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని, ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకునేలోపే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి భయరహితంగా, సురక్షితంగా వైద్యం పొందే హక్కు ఉందని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. నడవలేని పరిస్థితిలో ఉన్న రోగులను కనీసం, వీల్ చైర్ పై కూర్చోబెట్టే పరిస్థితి కూడా ఆసుపత్రిలో కనపడటం లేదు. ఇదంతా అధికారుల పర్యవేక్షణ లోపమేనని, ప్రజలు మండిపడుతున్నారు.






## గచ్చిబౌలి స్టేడియంలో యువ శౌర్య సేనకు ఘన విజయం

**హై రేంజ్ వరల్డ్ రికార్డు సాధించిన సింగప్పగూడెం విజ్ఞాన్ సాయి**

**మాస్టర్ రవీందర్ యాదవ్ లంటూ**

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో సింగప్పగూడెం విజ్ఞాన్ సాయి యువ శౌర్య సేన అత్యున్నత స్థాయి ప్రదర్శనతో హై రేంజ్ వరల్డ్ రికార్డు సాధించి సత్తా చాటడు . ఈ ఘన విజయంతో సింగప్పగూడెం పేరు మరోసారి మారుమోగింది. ఈ అద్భుత విజయానికి కృషి చేసిన యువ శౌర్య సేన సభ్యులను పలువురు అభినందించారు. యువతలో ప్రతిభను వెలికితీసి, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు నడిపిస్తున్న మాస్టర్ రవీందర్ యాదవ్ ని ప్రత్యేకంగా అభినందించారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ అందిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని ఈ కార్యక్రమం నిరూపించిందని పలువురు పేర్కొన్నారు. యువ శౌర్య సేన సాధించిన ఈ హై రేంజ్ వరల్డ్ రికార్డు మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పర్వేద వార్డు నంబర్ 1 సభ్యుడు రవీందర్ మాట్లాడుతూ, "యువతలో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో కూడా మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురాగలరు. సింగప్పగూడెం విజ్ఞాన్ సాయి మరియు యువ శౌర్య సేన సాధించిన ఈ ఘన విజయం మనందరికీ గర్వకారణం. ఈ విజయానికి కృషి చేసిన మాస్టర్ రవీందర్ యాదవ్ కి, యువ శౌర్య సేన సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. సింగప్పగూడెం విజ్ఞాన్ సాయి, మాస్టర్ రవీందర్ యాదవ్ మరియు యువ శౌర్య సేన సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.





# సూరారం పాఠశాలకు గోపీకృష్ణ మధుర జ్ఞాపకం..!!

- సూరారం జడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగ విరమణ వేడుకలు
- కన్నీటి పర్యంతమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- గోపీకృష్ణకు ఘనంగా వీడ్కోలు పలికిన గ్రామస్థులు
- 1989లో మొదలైన గోపీకృష్ణ సేవా ప్రస్థానానికి ముగింపు
- జ్ఞాపకాల్లో 37 ఏళ్ల అపురూప ప్రయాణం

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఒక ఉద్యోగం అంటే కేవలం విధులు నిర్వర్తించడం కాదు.. తాను పనిచేసే సంస్థతో, అక్కడి ప్రజలతో, విద్యార్థులతో అనుబంధాన్ని పెంచుకుని వారి జీవితాల్లో చెరగని ముద్ర వేయడం. అలాంటి అరుదైన అనుబంధానికి ప్రతీకగా నిలిచారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన తిరునారాయణపురం గోపీకృష్ణ. దాదాపు 37 సంవత్సరాల పాటు అదే పాఠశాల, అదే గ్రామంతో మమేకమై సేవలందించిన గోపీకృష్ణ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం ఆత్మీయత, అనురాగం, భావోద్వేగాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది.

**1989లో సూరారంలో మొదలైన సేవా ప్రస్థానం..**

గోపీకృష్ణ 1989లో సూరారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తన విధులను ప్రారంభించారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా పాఠశాలలోని ప్రతి మార్పుకు, ప్రతి తరానికి ఆయన ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. తరాలు మారాయి.. విద్యార్థులు మారారు.. ఉపాధ్యాయులు మారారు.. పాఠశాల రూపురేఖలు మారాయి.. కానీ పాఠశాలపై, విద్యార్థులపై గోపీకృష్ణ చూపిన ఆప్యాయత మాత్రం మారలేదు. పాఠశాలలో పనిచేసే ఉద్యోగిగా మాత్రమే కాకుండా గ్రామంలోని ప్రతి కుటుంబానికి పరిచయమైన వ్యక్తిగా ఆయన ఎదిగారు.

**నాన్ టీచింగ్ ఉద్యోగి అయినా, విద్యార్థులకు గురువుగా..**

రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించినప్పటికీ, ఉపాధ్యాయుల కొరత ఏర్పడిన సందర్భాల్లో విద్యార్థులకు అండగా నిలిచి ఓనమాలు నేర్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి కలిగించేలా వారితో కలిసిపోయి, తనకు చేతనైనంత మేర విద్యాబోధన చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. ఉద్యోగ పరంగా ఆయన నాన్ టీచింగ్ సిబ్బంది అయినప్పటికీ.. విద్యార్థుల దృష్టిలో మాత్రం ఆయన ఒక ఆత్మీయ పెద్ద, అవసరమైన సమయంలో అక్షరాలు నేర్పిన గురువు. అందుకే పదవీ విరమణ రోజున ఆయనను తలుచుకుంటూ పలువురు పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు.

**సెలవు అనేదే తెలియని సేవాభావం..**




పాఠశాల విషయంలో గోపీకృష్ణకు విధి సమయాల కంటే బాధ్యతే ముఖ్యమని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు గుర్తుచేశారు. అవసరమైన సమయంలో పాఠశాలకు అందుబాటులో ఉండటం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సహకరించడం, పాఠశాల పరిపాలనకు సంబంధించిన పనుల్లో చురుగ్గా పాల్గొనడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. "పాఠశాలే తన కుటుంబం.. విద్యార్థులే తన పిల్లలు" అన్నట్టుగా ఆయన వ్యవహరించారని పలువురు కొనియాడారు.

**గ్రామస్థులతో విడదీయరాని బంధం..**

గోపీకృష్ణ కేవలం పాఠశాల సిబ్బంది మాత్రమే కాదు.. సూరారం గ్రామ ప్రజలతో ఎంతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తి. గ్రామస్థులకు ఎప్పుడు అవసరం వచ్చినా తనకు సాధ్యమైనంత మేర సహకరిస్తూ అందరికీ అనుకూలంగా ఉండేవారని గ్రామ పెద్దలు గుర్తుచేశారు. దాదాపు 37 సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించడంతో గ్రామంలోని అనేక కుటుంబాలతో ఆయనకు వ్యక్తిగత అనుబంధం ఏర్పడింది. శనివారం ఆయన పదవీ విరమణ చేయడంతో "మనలో ఒకరు ఉద్యోగం నుంచి విరమిస్తున్నారు" అనే భావన గ్రామస్థుల్లో కనిపించింది.

**ఆత్మీయత నిండిన వీడ్కోలు..!!**

పదవీ విరమణ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, గోపీకృష్ణ కుటుంబ సభ్యులు, పలువురు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీకృష్ణను ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు 37 ఏళ్ల సుదీర్ఘ సేవలను గుర్తుచేసుకుంటూ మాట్లాడిన పలువురు భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాలలో గడిపిన ప్రతి క్షణం, విద్యార్థులతో ఉన్న అనుబంధం, సహోద్యోగులతో కలిసి పనిచేసిన రోజులు గుర్తుకొచ్చి కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు కనిపించాయి.

# 18వ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహణ

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** మండలంలోని ఐకేపీ భవనంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ 18వ సర్వసభ్య సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు సమావేశ అజెండాతో పాటు వార్షిక నివేదికను సభ్యులకు చదివి వినిపించి, వారి ఆమోదం పొందారు. అనంతరం సంఘంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సభ్యులను గుర్తించి, వారికి ఘనంగా సన్మానం చేసి అవార్డులను అందజేశారు. అదేవిధంగా ఐకేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన మహిళా సంఘాలకు రుణాలను మంజూరు చేశారు. మహిళా సంఘాలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు, కార్యదర్శి, మండల ఏపీఎం రవీందర్, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో, శంకర్‌పల్లి ప్రజావాణికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలి. శంకర్‌పల్లి: మండలంలో సోమవారం 24-08-2026 ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ పత్రికా ముఖంగా తెలియజేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులను అధికారులు స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని తెలిపారు.



# కొత్త బాధ్యతల్లో డా. సలువాజీ శ్రీధర్‌కు అభినందనల వెల్లువ...!



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన డా. సలువాజీ శ్రీధర్‌ను తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పశువైద్యాధికారి డా. బి. ప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్ డా. యస్. రామచంద్రుడు హాజరు కాగా, అసోసియేషన్ నుంచి జిల్లా అధ్యక్షురాలు డా. మనీషా పటేల్ కొమ్మెర, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బద్దం రాజేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ డా. గొల్లె అశోక్, జాయింట్ సెక్రటరీ డా. సైండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. సలువాజీ శ్రీధర్ సేవలను పలువురు కొనియాడుతూ, ఆయన నాయకత్వంలో జిల్లాలో పశువైద్య సేవలు మరింత మెరుగవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు

# తోటి వారిని గౌరవిస్తూ సంతోషంగా జీవించాలి

**గొడవలకు కేసులకు అహమే ప్రధాన కారణం: హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక**

**మందమర్రిలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు భవనం ప్రారంభం**

**మందమర్రి, ఆగస్టు 22 (క్రైమ్ మిర్రర్):** సమాజంలో గొడవలకు, కోర్టు కేసుల నమోదుకు మనుషుల్లోని 'అహం' ప్రధాన కారణమని, దానిని వీడి ప్రతి ఒక్కరూ తోటి వారిని గౌరవిస్తూ సోదరభావంతో జీవించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఎ.వీరయ్య, శారదా దేవి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, కోర్టు ఇంచార్జ్ జడ్జ్ కె.నిరోష, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, సింగరేణి జీఎం రాధాకృష్ణ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్యలతో కలిసి హాజరయ్యారు. ప్రాంగణానికి చేరుకున్న న్యాయమూర్తి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, మొక్కలు నాటారు.

**త్వరితగతిన న్యాయం అందాలి**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ... ప్రజలు చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా, ప్రశాంతంగా ఆలోచిస్తే ఎలాంటి వివాదాలకూ అవకాశం ఉండదన్నారు. న్యాయస్థానాలలో కేసుల వాయిదాల కాలాన్ని తగ్గించి, బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. చీకటి పొరల్లో చెమటోడ్చి కష్టపడుతూ దేశానికి వెలుగులు నింపుతున్న సింగరేణి కార్మికుల శ్రమ ఎంతో ప్రాధాన్యమైనదని కొనియాడారు.

**న్యాయసేవలు మరింత వేగవంతం: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలలో కోర్టుల ప్రారంభంతో స్థానికులకు న్యాయసేవలు చేరువవుతాయని ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

### రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు సేవా కార్యక్రమాలు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 21:** పద్మభూషణ్, పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ మెగా యూత్ ఫోర్స్ వెస్ట్ జోన్ కన్వీనర్ దంగేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అభిమానాన్ని కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల రూపంలో చాటుకున్నారు. మియాపూర్‌లోని సాయిరంగా థియేటర్ వద్ద చిరంజీవి 50 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జూబ్లీహిల్స్, అశోక్‌నగర్, జ్యోతి థియేటర్, పటాన్‌చెరు అంబేద్కర్ విగ్రహం, ఇస్నాపూర్ చౌరస్తా, రుద్రారం, గణేష్‌గడ్డ తదితర ప్రాంతాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని దంగేటి సత్యనారాయణ సందర్శించి రక్తదాతలను అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. బొల్లారంలోనూ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా, కౌసల్యనగర్‌లో ఏర్పాటు చేసిన మెగా క్యాంపును దంగేటి సత్యనారాయణ సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా దంగేటి సత్యనారాయణ మాట్లాడుతూ చిరంజీవి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. చిరంజీవి చూపిన సేవా స్ఫూర్తితో భవిష్యత్తులోనూ రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు సహాయ కార్యక్రమాలు, పేదలకు అండగా నిలిచే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. కార్యక్రమాల్లో మెగా అభిమానులు శివరాజు, శర్మ, రామారావు, బుజ్జి, గణపతిరావు, సుబ్బారావు, అప్పారావుతో పాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు. దంగేటి సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన వేడుకలు అభిమానుల సందడితో ఉత్సాహభరితంగా సాగాయి.

## కొండలయ్యగుట్టలో భక్తుల రద్దీ



**వనపర్తి ఆగస్టు 22 క్రైమ్ మిర్రర్:** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్ పల్లి గ్రామ శివారులో ఉన్న కలియుగ ప్రత్యక్ష దైవం కొండలయ్యస్వామి గుట్టపై కొలువైన పుణ్యక్షేత్రం శ్రావణమాసం రొండవ శనివారం రోజు భక్తులతో కళకల్లాడింది స్వామివారికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. కొండలయ్యగుట్టకు శ్రావణమాసం ప్రారంభంతో భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు శ్రావణమాసం, సంక్రాంతి పండుగ తప్పితే నిత్యపూజలు లేక నిర్మానుష్యంగా ఉన్న ఈ ఆలయాన్ని భక్తుల కోరిక మేరకు శ్రీ విశ్వకర్మ గాయత్రీ ట్రస్ట్ నిర్వాహకులు శ్రీ అరుణ్ కుమార్ స్వామి వెలుగులోకి తెచ్చేందుకు పూనుకున్నారు. రోడ్డు ఏర్పాటు చేసి గుట్ట పైకి మెట్లను పునరుద్ధరించి నీళ్ల ట్యాంకర్ కరెంటు మోటార్ ఏర్పాటు చేశారు. స్వామివారి సేవే మా పరమావధి అంటూ ట్రస్ట్ సభ్యులు నిత్యపూజల చేస్తున్నారు . గుట్ట కింద ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటయ్య యాదవ్. ట్రస్టు సభ్యులు భరత్ కుమార్. బాలరాజు. ప్రవీణ్ కుమార్. భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మూడు సేవా కార్యక్రమాలు



**క్రైమ్ మిర్రర్ , ఆగస్టు 8:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మూడు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ శుభ సందర్భాలను సేవా కార్యక్రమాలుగా మలిచి, అవసరంలో ఉన్న వారికి సహాయం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. అంబాలా నివాసి మానవ్ అగర్వాల్ జన్మదినం సందర్భంగా పేద పిల్లల పాఠశాలలో ఉదయం అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు అల్పాహారం స్వీకరించి, మానవ్ అగర్వాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వంశీ కృష్ణ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో ఉదయం అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులు అల్పాహారం స్వీకరించి, వంశీ కృష్ణకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆశీర్వదించారు. మూడవ కార్యక్రమంలో అమెరికా నివాసి నిఖిల్ రెడ్డి సహకారంతో వృద్ధాశ్రమంలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 50 మంది వృద్ధులు భోజనం చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి శుభ సందర్భాలను అవసరంలో ఉన్నవారితో పంచుకోవడం ద్వారా వాటికి మరింత అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు. "మానవ సేవే మాధవ సేవ" అనే భావనతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సమితి అధికారులు, సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ సందర్భాలను సేవా కార్యక్రమాలుగా నిర్వహించి, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలని సమితి పిలుపునిచ్చింది. కృష్ణ గోపాల్ సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు ౹8106876999౹ నంబర్‌ను సంప్రదించవచ్చు.

## పాలిటెక్నిక్ విద్యార్థులను రెచ్చగొడుతున్న బిఆర్ఎస్



**కేటీఆర్ నీచ రాజకీయాలు మానుకోవాలి: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్**

**మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యలను వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సిగ్గుచేటు**

**జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు మరింత భరోసా**

**గ్లోబరీనా దారుణంలో 25 మంది ఇంటర్ విద్యార్థుల బలి గుర్తులేదా?**

**కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**రామకృష్ణాపూర్: ఆగస్టు 22 (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యార్థులను రెచ్చగొట్టి రోడ్ల మీదికి తెస్తూ బిఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ

గత రెండు మూడు రోజులుగా పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలుపుతూ, సాంకేతిక విద్యకు సంబంధించి తమకున్న సమస్యలపై ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర కార్మిక, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి, గడ్డం వివేక్ వెంకటస్వామి స్వయంగా మాసబ్ ట్యాంక్ వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లారని పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థుల వద్దకే వెళ్లి మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించి సందేహాలను నివృత్తి చేసే దిశగా ప్రభుత్వం తరపున సానుకూలంగా స్పందించారని చెప్పారు.

### నైపుణ్యంతో కూడిన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

2024లో తెలంగాణ ప్రభుత్వం ఐటిఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా మార్చేందుకు సంకల్పించి, రాష్ట్రవ్యాప్తంగా 64 కేంద్రాలను ప్రారంభించిందని గుర్తుచేశారు. పురాతనంగా బోధిస్తున్న విద్య నేటి పరిశ్రమలకు సరిపోదని, నాణ్యమైన, నైపుణ్యంతో కూడిన విద్యను అందిస్తేనే విద్యార్థుల్లో సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. అలాగే 2026లో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' పరిధిలోకి పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను అప్పగిస్తూ జీవో నెంబర్ 97 తీసుకొచ్చామని తెలిపారు. యంత్ర విజ్ఞానం (రోబోటిక్స్), ఆధునిక పారిశ్రామిక రంగానికి అనుగుణంగా పాఠ్యాంశాలు మార్చి విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. డిప్లమా మూడో సంవత్సరం పూర్తయ్యాక ప్రవేశ పరీక్ష (ఈ-సెట్) ద్వారా నేరుగా ఇంజనీరింగ్ (బి.టెక్) రెండో సంవత్సరంలో చేరే అవకాశం యథావిధిగా ఉంటుందని, విలీనం వల్ల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.

### సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ రాక్షసానందం

మంత్రి వివేక్ వెంకటస్వామి విద్యార్థుల సందేహాలను తీర్చే క్రమంలో మాట్లాడిన మాటలను బిఆర్ఎస్ నాయకులు వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. 2019లో బిఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా అనే సంస్థ పరీక్షల ప్రక్రియలో చేసిన తప్పిదాలతో 25 మంది ఇంటర్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని, గ్రూప్-1 పరీక్షల రద్దును కేటీఆర్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై చేయడానికి ఏ అంశాలు దొరక్కపోవడంతోనే బిఆర్ఎస్ శ్రేణులను ఉసిగొల్పి పాలిటెక్నిక్ కళాశాలల్లోకి పంపి విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, వెనుకబడిన తరగతులు, బీసీ,ఎస్సీ సంక్షేమ పాఠశాలలను బలోపేతం చేస్తూ కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైళ్లలో కోచ్‌ల పెంపునకు సానుకూలత

**పీసీఎంఈకి వినతిపత్రం అందజేసిన డీఆర్‌యూసీసీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్**



**మంచిర్యాల, ఆగస్టు 22 క్రైమ్ మిర్రర్):** సింగరేణి ఇంటర్‌సిటీ, రామగిరి, బల్లార్షా--కాజీపేట రైళ్లలో గతంలో తొలగించిన కోచ్‌లను పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ) బి.వి. జయ్‌కుమార్ రత్‌ను కోరారు. ఈ మేరకు శనివారం రైల్ నిలయంలో పీసీఎంఈని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.రైళ్లలో కోచ్‌ల సంఖ్య తగ్గించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాస్ తెలిపారు. రాఖీ, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న విధంగా అదనపు కోచ్‌లను పునరుద్ధరించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.వినతిపై పీసీఎంఈ బి.వి. జయ్‌కుమార్ రత్ సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఇదే అంశాన్ని ఇప్పటికే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాశారని శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికుల సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాము నాయక్, బెల్లంపల్లి శివప్రసాద్, వేముల నరేష్ పాల్గొన్నారు.

# మందమర్రిలో నూతన న్యాయస్థాన భవనాన్ని ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక

**చీకటి భూమి పొరల్లో చెమటోడ్చి కష్టపడి దేశానికి వెలుగులు నింపుతున్న సింగరేణి కార్మికులు**




**మందమర్రి టౌన్ ఆగస్టు 22 క్రైమ్ మిర్రర్:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో నూతనంగా జూనియర్ సివిల్ జడ్జ్ – కమ్ – జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థాన భవనాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక శనివారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటిన అనంతరం మూడు మతాల పెద్దల సమక్షంలో కోర్టు భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో తోటి వారిని గౌరవించుకుంటూ సంతోషంగా బ్రతకాలని అన్నారు. కోర్టు భవనాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పక్కవారిని గౌరవించాలని, సమాజంలో గొడవలకు, కేసుల నమోదుకు మనలోని అహం ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరు ఒక్క క్షణం ప్రశాంతంగా ఆలోచిస్తే ఎలాంటి గొడవలకు అవకాశం ఉండదని తెలిపారు. మన ధర్మాలు, గ్రంథాల ప్రకారం ప్రజలలో శాంతి లేకపోవడమే శాంతి భద్రతల విఘాతానికి ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని తెలిపారు. న్యాయస్థానాలలో కేసులలో వాయిదా కాలాన్ని తగ్గించి త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా అందరితో స్నేహభావంతో మెలగాలని, చైతన్యవంతంగా, శక్తివంతంగా, ఆనందంగా బ్రతకాలని తెలిపారు. సింగరేణి కార్మికుల గురించి మాట్లాడుతూ చీకటిలో భూమి పొరల్లో చెమటోడ్చి కష్టపడి దేశానికి వెలుగులు నింపుతున్నారని, వారి శ్రమ గుర్తించదగినదని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలలో కోర్టు భవనాలను ప్రారంభించడం ద్వారా కేసుల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాలో అవసరమైన న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడర్లు, అందుబాటులో ఉన్నారని, కేసుల పరిష్కారంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రారంభానికి ముందుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక మందమర్రి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు మంచిర్యాల, కుమ్రంభీం, ఆసిఫాబాద్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఎ.వీరయ్య, శారదా దేవి,మంచిర్యాల జిల్లా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్, మందమర్రి కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్ – కమ్ – జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇంచార్జ్ జడ్జ్ కె.నిరోష, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, న్యాయస్థానాల అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న ప్లాట్.. 7, 8 అంతస్తుల భవనాలు..!

**అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు..!**

**నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు**

**అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదుదారు ఆవేదన**

**ప్లాట్ నంబర్లతో సహా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు.**


**క్రైమ్ మిర్రర్ కొండాపూర్:** చిన్న విస్తీర్ణంలోని ప్లాట్లలో నిబంధనలకు విరుద్ధంగా భారీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. జూన్ 15, 2026న సమర్పించిన ఫిర్యాదులో పలు నిర్మాణాలకు సంబంధించిన వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. సుమారు 50 నుంచి 100 గజాల పరిధిలో ఉన్న చిన్న ప్లాట్లలోనే 7, 8 అంతస్తుల భారీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి నిర్మాణాలకు అవసరమైన నిబంధనలు, అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అనుమానాలు వ్యక్తం చేశారు.

### ఫిర్యాదులు చేసినా చర్యలు లేవా?

అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుదారు ఆరోపించారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నిర్మాణ దశలోనే అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చిన్న ప్లాట్‌లో బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఎలా లభించింది? ఆమోదించిన భవన నిర్మాణ ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుంటే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించలేదు? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

### ప్లాట్ నంబర్లతో సహా ఫిర్యాదు

ఫిర్యాదులో పలు నిర్మాణాలకు సంబంధించిన ప్లాట్ నంబర్లను కూడా ప్రస్తావించారు. =శ్రీను చీ.2, గ్రాశ్రీ చీ.161/3; =శ్రీను చీ.3, గ్రాశ్రీ చీ.1555; =శ్రీను చీ.4, గ్రాశ్రీ చీ.1446, 1447; =శ్రీను చీ.5, గ్రాశ్రీ చీ.230 తదితర వివరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్లాన్లు, నిర్మాణ విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఫిర్యాదుదారు కోరారు. అసలు అనుమతులు ఎవరిచ్చారు? చిన్న స్థలాల్లో భారీ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారా? ఒకవేళ అనుమతులు ఉంటే ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారు?


తేది-15-06-2026

నిర్మాణదారులు ఆమోదిత ప్లాన్‌ను ఉల్లంఘించారా? నిర్మాణాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించారా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఫిర్యాదుదారు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్ ఈ ఫిర్యాదుపై స్పందించి సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేయించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చిన్న ప్లాట్‌కు ఇంత పెద్ద నిర్మాణం ఎలా సాధ్యమైంది..?

అనుమతులు ఎవరిచ్చారు..?

నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

అక్రమ నిర్మాణాలకు అండగా ఎవరున్నారు..?

ఈ ప్రశ్నలకు మున్సిపల్ అధికారులు ఇచ్చే సమాధానాలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.




# పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ. జనార్ధన్ ఏకగ్రీవ ఎన్నిక

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 22:** పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అన్నారు. సంగారెడ్డి జిల్లాలో పోలీస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ శనివారం విజయవంతంగా పూర్తయింది. ఓటింగ్ అవసరం లేకుండా పోలీస్ సిబ్బంది పరస్పర సమన్వయం, సహకారంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షులుగా ఇన్‌స్పెక్టర్ బి. రమేష్, ఎస్ఐ బి. నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా హెడ్ కానిస్టేబుల్ ఎం. రాజారామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హెడ్ కానిస్టేబుల్ జి. సంతోష్ కుమార్, ఖజాంచిగా హెడ్ కానిస్టేబుల్ కూన రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. పదవి ఎంత గొప్పదో, దానితో వచ్చే బాధ్యత కూడా అంతే గొప్పదని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీస్ సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం, హక్కులు, సంక్షేమ కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారిగా సమన్వయం చేసిన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ సురేందర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదినాగుడా డివిజన్

# టీఆర్ఎస్ అధ్యక్షుడిగా కొల్లూరు కుమార్ నియామకం....

**క్రైమ్ మిర్రర్ మియాపూర్:** తెలంగాణ రక్షణ సేన. (టీ ఆర్ ఎస్ )పార్టీలో కీలక నియామకం జరిగింది. మాదినాగుడా డివిజన్ ప్రెసిడెంట్ గా కొల్లూరు కుమార్ ను నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది.పార్టీ కోసం నిత్యం కృషి చేస్తున్న కొల్లూరు కుమార్ సేవలను, నాయకత్వ లక్షణాలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళు ్లగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆయనకు ఈ పదవి దక్కడం పట్ల శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా కొల్లూరు కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మాదినాగుడా డివిజన్ బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత, వాసాలి చంద్ర శేఖర్ ప్రసాద్ అసెంబ్లీ ఇంచార్జ్ శేలింగంపల్లి , లకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధికి, డివిజన్ లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూలు):** నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంలో మీడియా ప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తున్నారని, మరింత విస్తారంగా అవగాహన కల్పించేలా పోషించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఉద్దేశం అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో కొనసాగించడం, అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా చూడటమేనని, ప్రజల్లో ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని మీడియాకు సూచించారు. శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, గుర్తించిన ఓటర్ల వివరాలు, నోటీసుల జారీ, బూత్ లెవల్ అధికారుల ద్వారా కొనసాగుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలను ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. ప్రజలకు ప్రభుత్వ, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా, విస్తృతంగా చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ముఖ్యంగా ఎస్ఐఆర్ వంటి విస్తృత స్థాయిలో జరుగుతున్న ప్రక్రియపై ప్రజలకు సరైన సమాచారం అందించేందుకు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాలు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గతంలో 880 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 910 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నెల రోజుల పాటు జిల్లాలో అధికారులు ఓటర్ జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తులకు హియరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, అర్హులైన ఓటర్లు తమ పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఓటర్ జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సవరణలు, మార్పులు, చేర్పులు లేదా తొలగింపులకు సంబంధించి నిర్ణీత దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఈ పరిశీలనలో భాగంగా 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాని 13,216 మంది ఓటర్లను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఓటర్లు సమర్పించిన ఎన్‌మరేషన్ ఫారాల్లో ప్రస్తుతం నమోదైన ఇంటి పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, చిరునామా తదితర వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాలోని వివరాలతో సరిపోల్చి పరిశీలించినట్లు చెప్పారు. ఈ వివరాల విశ్లేషణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మరో 1,02,635 మంది ఓటర్లను గుర్తించినట్లు కలెక్టర్ వివరించారు. రెండు విభాగాల్లో గుర్తించిన ఓటర్లను కలిపి జిల్లాలో మొత్తం 1,15,851 మంది ఓటర్లను గుర్తించినట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన 1,15,851 మంది ఓటర్లకు గత రెండు రోజులుగా నోటీసులు జనరేట్ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు నోటీసులు అందజేస్తూ, అవసరమైన వివరాలను తెలియజేసే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కొనసాగిస్తున్నారని చెప్పారు. నోటీసులు అందిన ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలను మరింత స్పష్టంగా ధ్రువీకరించేందుకు, జాబితాలో అర్హులైన ఓటర్లను నిర్ధారించేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే భారత ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అందువల్ల అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు కూడా అనవసరంగా తొలగిపోకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి దశలోనూ అవసరమైన పరిశీలన, ధ్రువీకరణ చేపడుతున్నామని, ఓటర్లకు సంబంధించి అందుబాటులో ఉన్న వివరాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణల ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సైతం ఓటర్ జాబితా సవరణలు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అధికారులు సిబ్బంది రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా, అలాగే అనర్హుల పేర్లు ఉండకుండా నిబంధనల ప్రకారం జాబితాను సక్రమంగా సవరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు ఓటర్లకు అందుతున్న నోటీసుల ఉద్దేశం, తదుపరి వారు చేపట్టాల్సిన చర్యలు, అవసరమైన వివరాలు సమర్పించే విధానం తదితర అంశాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని మీడియా ప్రతినిధులను కోరారు. కేవలం కార్యాలయ స్థాయిలో సమాచారం అందించడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న సందేహాలను గుర్తించి, వాటిపై అధికారుల నుంచి స్పష్టత తీసుకుని వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. తప్పుడు సమాచారం, అసత్య ప్రచారం, అపోహలకు తావులేకుండా అధికారిక సమాచారాన్ని ఆధారంగా చేసుకుని వార్తలను ప్రచురించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు అధికారులు మాత్రమే కాకుండా ప్రజలు, మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ అన్నారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఓటర్లను కలిసి నోటీసులు అందజేస్తూ, అవసరమైన సమాచారాన్ని తెలియజేస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా తమకు అందిన సమాచారాన్ని నిర్లక్ష్యం చేయకుండా, సంబంధిత అధికారులను సంప్రదించి తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు లేదా వ్యత్యాసాలు ఉన్నట్లయితే, నిబంధనల ప్రకారం వాటిని సరిచేసుకునేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. పజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి అర్హుడైన పౌరుడికి ఎంతో ముఖ్యమైనదని, ఓటరు జాబితా సక్రమంగా ఉండటం ఎన్నికల ప్రక్రియకు పునాది వంటిదని అన్నారు. అందువల్ల ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, అధికారులు చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కోల్పోకుండా చూడటంతో పాటు, ఓటరు జాబితాను మరింత పకడ్బందీగా రూపొందించేందుకు అధికారులు నిరంతరం పనిచేస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల సంఘం సూచించిన పత్రాల జాబితా సమగ్రంగా మాత్రమే కాకుండా, సంబంధిత సందర్భంలో నిబంధనలకు అనుగుణంగా చెల్లుబాటు అయ్యే ఇతర పత్రాల విషయంలో కూడా అధికారుల మార్గదర్శకత్వం తీసుకోవచ్చని అధికారులు తెలిపారు.

**ప్రధానంగా సమర్పించగల పత్రాల్లో:**

1. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, పింఛనుదారులకు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (ప్రూా).
2. 01.07.1987కి ముందు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, బ్యాంకులు, పోస్టాఫీసులు, ఎల్ఐసీ లేదా ప్రభుత్వ రంగ సంస్థలు భారతదేశంలో జారీ చేసిన గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం లేదా ఇతర అధికారిక పత్రం.
3. సమర్థ అధికార యంత్రాంగం జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం.

# హెజోలో కెమికల్ కంపెనీలో.. రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికుల మృతి








భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 22 : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామం శివారులోని హెజోలో లేబోరేటరీస్ కెమికల్ కంపెనీలో శుక్రవారం రాత్రి రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు కార్మికుల పరిస్థితి విషమంగా మారింది. హెజోలో కంపెనీలో సిబ్లాక్ లో నైట్ షిఫ్ట్లో 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కంపెనీలో పని చేస్తుండగా రియాక్టర్ భారీ శబ్దంతో పేలి పోవడంతో మంటలు క్షణాల్లో వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడులో నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చిన్నగూడెం చెందిన చెన్ను నాగిరెడ్డి(31), ఖమ్మం జిల్లా మెయిన్ రోడ్ దారానికి చెందిన నాగనబోయిన నరేశ్‌కుమార్(29) మృతి చెందారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. రియాక్టర్ వద్ద పని చేస్తున్న పదిమంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం వారిని హైదరాబాద్‌కు తరలించారు. రియాక్టర్ భారీ శబ్దంతో పేలడంతో కార్మికులు, పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న చౌటుప్పల్ రూరల్ సీఐ సతీశ్‌రెడ్డి, ఎస్ఐ జగన్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చౌటుప్పల్ హయత్ నగర్ నుంచి ఫైర్ ఇంజన్లు చేరుకొని మంటలను ఆర్పాయి. గత జూలై 16న రసాయన విష వాయువులు పీల్చడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లుకు చెందిన కార్మికుడు ఆలుమూరు కృష్ణారెడ్డి(42) మృతి చెందాడు. ప్రమాదం జరిగి నెల రోజులు కాకముందే రియాక్టర్ పేలడం భద్రత వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం, భద్రతా ప్రమాణాలు లోపించడంతో కంపెనీల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రియాక్టర్ భారీ శబ్దంతో పరిసర గ్రామాల ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రోడ్డు పైకి పరుగులు తీశారు. వరుస ప్రమాదాలు జరగడంతో గ్రామంలో భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి నుంచి పోలీసులు కంపెనీలో భారీ బందో బస్తు నిర్వహిస్తున్నారు.

**మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి**

మృతుల కుటుంబాలకు రూ.10 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం హెజోలో కెమికల్ కంపెనీ ఎదుట రాజకీయ నాయకులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. మృతుల ఒకో కార్మిక కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్‌గ్రేషియా, మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పీసీబీ అధికారుల నిర్లక్ష్యం, కంపెనీ యజమానుల భద్రతా లోపంతో కార్మికుల ప్రాణాలను బలిగొంటున్నారని, అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, పీసీబీ అధికారులు, కంపెనీ యజమాన్యం వచ్చే వరకు ఆందోళన విరమించబోమని హెచ్చరించారు. కంపెనీ ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కంపెనీలోకి వెళ్లేందుకు గ్రామస్తులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. గ్రామస్తులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది . దోతిగూడెం నుంచి పరిశ్రమలను తరలించే దాకా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆర్డీవో శేఖర్‌రెడ్డి , డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి, పీసీబీ ఈఈ వెంకన్న, లేబర్ ఆఫీసర్ ఈ చంద్రశేఖర్, ఇండస్ట్రియల్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, తాసీల్దార్ శ్రీనివాసరెడ్డి, సీఐలు మన్మథరావు, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ జగన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

**హెజోలో కంపెనీ సీజ్ యాదాద్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాసర్ రావు**

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 22: రియాక్టర్లను పూర్తిగా మరమ్మతు చేసే వరకు హెజోలో లాబరేటరీస్ కంపెనీని సీజ్ చేస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాసరరావు ప్రకటించారు. శనివారం భూదాన్ పోచంపల్లి మండలం ధోతి గూడెం గ్రామం హెజోలో పరిశ్రమలో జరిగిన ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. అన్ని విషయాలపై ఆరా తీశారు. మృతుల ఒక్కో కుటుంబానికి రూ.1.80 కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కంపెనీ యజమాన్యానికి ఆయన సూచించారు . నైట్ షిఫ్ట్లో రాత్రి 10 నుంచి 10.30 గంటల లోపు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని , దీనిపై విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. క్షతగాత్రులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్యుల ఖర్చుల బాధ్యత కంపెనీ యజమాని భరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాట జంగయ్య, ఉప సర్పంచ్ బద్దం వెంకటరెడ్డి, నాయకులు ఉటూరి అశోక్, ఏలే చంద్రశేఖర్, పగిళ్ల రామ్‌రెడ్డి, ముద్దం సత్యం, కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు తదితరులు పాల్గొన్నారు.

## మురుగేశన్ వేలుకు రాష్ట్ర ఆర్టీఐ యాక్టివిస్ట్ విభాగం చైర్మన్‌గా నియామకం.



**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ (రిజి.) తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ యాక్టివిస్ట్ విభాగం చైర్మన్‌గా మురుగేశన్ వేలును నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మబ్బూబ్ రాయ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీకి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఏడాది పాటు ఆయన ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. సమాజంలోని యువత, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు తదితరులకు వారి హక్కులపై అవగాహన కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంస్థ సూచించింది. మురుగేశన్ వేలును రాష్ట్ర చైర్మన్‌గా నియమించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపిన మురుగేశన్ వేలు, ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## గణేశ్ ఉత్సవాలకు సమన్వయంతో పనిచేయండి

మల్కాజిగిరి, ఆగస్టు 22 : అవరోధాలులేని, సురక్షితమైన నిమజ్జానికి సమన్వయంతో శాఖలు పనిచేయాలని ఎంఎంసీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. వినాయకచవితి, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై శనివారం ఎంఎంసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు, మార్గాలు, చెరువులు, సరస్సులు, బేబీపాండ్లు, తదితర ప్రాంతాల వద్ద చేపట్టాల్సిన మౌలిక సౌకర్యాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. భద్రత, పారిశుధ్యం, మరమ్మతులు, విద్యుత్, పచ్చదనం, తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు రాధికాగుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్‌మహతో, అదనపు కమిషనర్ రఘుప్రసాద్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సునంద, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

